
TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 196 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ మంగళవారం.10.02.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




## బీఆర్ఎస్‌ది దోపిడీ మార్గం బీజేపీది భావదారిద్ర్యం

హైదరాబాద్ అమృత్ తెలంగాణ: బీజేపీ, బీఆర్ఎస్ దొందూ దొందే అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలకు ప్రధాని మోడీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. ఇంటిదగ్గర మోరీ నిండితే మోడీ వచ్చి తీస్తారా? అని ఎద్దేవా చేశారు. రాష్ట్రం నుంచి కేంద్రమంత్రులుగా పనిచేస్తున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఆపార్టీకి చెందిన ఎంపీలు ప్రధాని మోడీని ఒప్పించి, రాష్ట్రానికి అదనంగా ఏం తెచ్చారో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. బీజేపీ నేతలు రోజూ శ్రీరాముడిని తలుచుకోకున్నా, ఎంఐఎంను మాత్రం స్మరిస్తూనే ఉంటారన్నారు. మత విద్వేషాలు తప్ప వారికి మరో ఎజెండా లేదనీ, ఆపార్టీ రాజకీయ భావదారిద్ర్యానికి ఇదే నిదర్శనమని విమర్శించారు. కేంద్రంలో 12 ఏండ్లుగా మోడీ, రాష్ట్రంలో పదేండ్లు కేసీఆర్ అధికారాన్ని చెలాయించారనీ, వీరిద్దరి వల్ల ప్రజలకు ఒనగూరిన ప్రయోజనాలు ఏంటని ప్రశ్నించారు.

రాష్ట్రంలో పదేండ్లు అన్ని వార్డులు, గ్రామపంచాయతీలు, మున్సిపాల్టీల్లో అధికారాన్ని వెలగబెట్టింది బీఆర్ఎస్ నేతలేననీ, అప్పట్లో వారందరినీ ఉత్సవ విగ్రహాలుగా మార్చి 'ఆ నలుగురు' అధికారాన్ని చెలాయించారని గుర్తుచేశారు. ఇప్పుడు స్థానిక సంస్థల్లో సమస్యలు న్నాయంటూ సన్నాయినొక్కులు నొక్కుతున్నారనీ, అంటే ఈ పదేండ్లలో వారు ప్రజలకు ఏం చేయలేదని ఒప్పుకుంటున్నట్టేనని స్పష్టంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కండ్ల ముందున్న గతం, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఆలోచించి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

సత్రం భోజనానికి కేంద్రమంత్రుల రికమండేషన్

గతంలో హైదరాబాద్ వరదల సమయంలో ముంపునకు గురైన ప్రాంతాల్లో కారుకు కారు, బైకుకు బైకు ఇస్తామని జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ ప్రచారం చేస్తే, దాన్ని కిషన్‌రెడ్డి ఆమోదించారని తెలిపారు. ఆ మాట నమ్మి జీహెచ్ఎంసీలో 1/3 ప్రజలు బీజేపీకి ఓటు వేస్తే, ఇప్పటి వరకు ఆ ఊసే లేకపోగా, ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసుకోమని ఓ ఉచిత సలహా పడేశారనీ, ఇదీ ప్రజల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధి అని వివరించారు. సత్రం భోజనానికి నెల్లూరు పెద్దారెడ్డి రెకమెండేషన్ ఇవ్వడమంటే ఇదేనని చమత్కరించారు.

ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టొద్దు

తెలంగాణకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని కేంద్రమంత్రులు బండిసంజయ్, కిషన్‌రెడ్డి, ఆపార్టీ ఎంపీలు ప్రధాని, నిట్ ఆయోగ్ వద్ద ఎందుకు ప్రస్తావించరని ప్రశ్నించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టినట్టు మాట్లాడితే మీకు న్యాయమనిపిస్తుందా అని అడిగారు. రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా తీసుకురాలేదనీ, కనీసం మూసీ ప్రక్షాళన, మెట్రోరైల్ విస్తరణ కోసం అదనంగా ఎలాంటి గ్రాంట్‌ను తేలేదని గుర్తుచేశారు.

సమ్మక్క సారక్క జాతరకు కేంద్రం నుంచి ఎన్ని ప్రత్యేక నిధులు తెచ్చారని నిలదీశారు. పైపెచ్చు యూపీఏ హయాంలో తెలంగాణకు ఇచ్చిన ఐటీఐఆర్‌ను మోడీ రద్దు చేస్తే, సెమీ కండక్టర్ ప్రాజెక్టులు రాకుండా అడ్డుపడితే బీజేపీ ఎంపీలు, కేంద్రమంత్రులు ఏం చేస్తున్నారని అడిగారు. రాష్ట్రం సంగతి సరే...కనీసం మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకైనా అదనంగా నిధులు తెచ్చారా అని ప్రశ్నించారు.



ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేసిన పలు సంక్షేమ కార్యక్రమాలను ఆయన ఏకరువు పెట్టారు.

ప్రాజెక్టుల సంగతి ఏం చేశారు?

2014 ఎన్నికల సందర్భంగా నరేంద్రమోడీ పాలమూరు సభలో మాట్లాడుతూ పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామన్నారు ఎన్నికల ప్రచారానికి వచ్చిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ ఈ అంశాన్ని ప్రస్తావించి జాతీయ హోదా ప్రకటిస్తారనుకుంటే ఆయన నిరాశపరిచారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ ఆదిలాబాద్‌లో ప్రచారానికి వచ్చి ఆ జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్‌ను పూర్తి చేసేందుకు సహకరిస్తామని ప్రకటిస్తారని భావించాం. కానీ ఆయన తెలంగాణ ప్రజల్ని అవమానించి మాట్లాడి, ఓట్లు మాత్రం తమపార్టీకి వేయాలని కోరారు.

మేం ఇచ్చేదెంత? మీరు ఇస్తున్నదెంత?

కేంద్రం నుంచి ఏ మంత్రి వచ్చినా లక్షల కోట్లు మంజూరు చేశామని చెప్తున్నారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి రూ.1 వెళ్తే, వస్తున్నది 42 పైసలే. అలాగే కర్ణాటకకు 16 పైసలు, తమిళనాడుకు 26 పైసలు, కేరళకు 49 పైసలు మాత్రమే ఇస్తూ దక్షిణాది రాష్ట్రాలకు బీజేపీ తీరని అన్యాయం చేస్తుంది. అదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాలైన బీహార్‌లో ఒక రూపాయి కేంద్రానికి వస్తే, రూ.6.06 పైసలు ఇస్తున్నారనీ, మధ్యప్రదేశ్‌కు రూ.2.09 పైసలు, ఉత్తర ప్రదేశ్‌కు రూ.2.03 పైసలు ఇస్తున్నారు.

అభివృద్ధి నిరోధకులు

అభివృద్ధి నిరోధకులుగా బీజేపీ, బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో వారిద్దరికీ ప్రజలు బుద్ధి చెప్పాలి. బీఆర్ఎస్ నేతలు టెలిఫోన్ ట్యాపింగ్ ద్వారా వ్యాపారులను బెదిరించి వందల కోట్లు వసూలు చేశారు. దానిపై విచారణకు పిలిస్తే సిగ్గుపడుతూ ముసుగు తొడుక్కుని వెళ్లకుండా, బరితెగించి ఏదో యుద్ధానికి వెళ్లినట్టు వెళుతున్నారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తూనే ఉన్నారు.

## సైబర్ దోపిడీ ద్వారా రూ.54 వేల కోట్లు స్వాహాపై సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: సైబర్ దోపిడీ (డిజిటల్ మోసాల) ద్వారా రూ.54 వేలకోట్లకు పైగా స్వాహా కావడంపై సుప్రీంకోర్టు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది 'దోపిడీ, దొంగతనం'గా అభివర్ణించింది. సైబర్ మోసాలపై ఆర్బీఐ, బ్యాంకులు, టెలీకమ్యూనికేషన్ శాఖ (డీఓటీ)తో సంప్రదించి నాలుగు వారాల్లోగా ప్రామాణిక ఆపరేటింగ్ (ఎస్ఓటీ) ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాల్సిందిగా కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. పలు చిన్న రాష్ట్రాల బడ్జెట్ల మొత్తం కన్నా డిజిటల్ మోసం ద్వారా స్వాధీనం చేసిన నగదు ఎక్కువని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చి, జస్టిస్ ఎన్‌వి అంజరియాతో కూడిన ధర్మాసనం తెలిపింది. బ్యాంకు అధికారుల కుట్ర లేదా నిర్లక్ష్యం కారణంగా ఇటువంటి నేరాలు జరగవచ్చని వివరించింది. ఆర్బీఐ, బ్యాంకుల నుంచి సకాలంలో చర్యలు అవసరమని సూచించింది. ఆర్బీఐ, టెలికాం శాఖ (డీఓటీ) సూచనలు, ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలను పరిగణనలోకి తీసుకుని నాలుగు వారాల్లోగా ముసాయిదా అవగాహన ఒప్పందాన్ని రూపొందించాలని హోంశాఖను ఆదేశించింది. సైబర్-ఆధారిత మోసాలను నిరోధించడానికి డెబిట్ కార్డులను తాత్కాలికంగా నిలిపివేసేందుకు బ్యాంకులు చర్యలు చేపట్టేలా ఎస్ఓపీని ఆర్బీఐ రూపొందించిందని తెలిపింది. సైబర్ అరెస్ట్ కేసులను గుర్తించాలని సీబీఐని ఆదేశించింది. గుర్తించిన డిజిటల్ అరెస్టు కేసుల్లో దర్యాప్తును కొనసాగించడానికి సీబీఐకి అనుమతినివ్వాలని గుజరాత్, ఢిల్లీ ప్రభుత్వాలను కోరింది. డిజిటల్ అరెస్ట్ కేసుల్లో పరిహారం అందించడానికి ఒక ప్రణాళికను (ఫ్రేమ్ వర్క్‌ను) రూపొందించడానికి ఆర్బీఐ, డీఓటీ ఇతరులు సంయుక్తంగా సమావేశాన్ని నిర్వహించాలని ఆదేశించింది. బాధితులకు పరిహారం మంజూరు చేయడంలో ఆచరణాత్మక, ఉదారవాద విధానం అవసరమని తెలిపింది. నాలుగు వారాల తర్వాత తదుపరి విచారణ చేపడతామని ఆదేశించింది. తదుపరి విచారణ తేదీలోపు తాజా స్టేటస్ నివేదికను సమర్పించాల్సిందిగా అధికారులను ఆదేశించింది.

## 'సమ్మక్క-సారక్క' హుండీల లెక్కింపు.. ఇప్పటి వరకు ఎంత వచ్చిందంటే..



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: మేడారం సమ్మక్క-సారక్క జాతర హుండీల లెక్కింపు కొనసాగుతోంది. ఐదోరోజు ఆలయ సిబ్బంది 163 హుండీలను లెక్కించారు. వీటి ద్వారా రూ.1.12 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పటి వరకు మొత్తం 788 హుండీలను లెక్కించగా.. రూ.11.83 కోట్ల ఆదాయం వచ్చింది. మిగిలిన హుండీల లెక్కింపునకు మరో రెండ్రోజులు పట్టవచ్చని ఆలయ సిబ్బంది తెలిపారు. నోట్ల లెక్కింపు పూర్తయ్యాక బంగారం, వెండి వస్తువుల విలువను నిర్ధరించనున్నారు.

## కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్



పరకాల :అమృత్ తెలంగాణ: కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్ అని, ఎన్నికల ముందు రాష్ట్రానికి ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు ఇప్పటికీ నెరవేర్చకుండా ప్రజలు నష్టపోయేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ఎన్నికల ముందు గ్యారెంటీల బాండ్ పేపరు రాసిచ్చారని.. ఇప్పటికీ వాటిని అమలు చేయలేక విఫలమయ్యార న్నారు. సోమవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో బస్టాండు కూడలి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద రోడ్ షోలో కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి తెల్లారి లేస్తే కేసీఆర్‌ను తిట్టడమే తప్ప చేసిందేమీ లేదన్నారు. రేవంత్‌రెడ్డి నమ్మిన ప్రజలను నట్టేటా ముంచారని, అన్న వస్త్రం కోసం వస్తే ఉన్న వస్త్రం పోయిన చందంగా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయన్నారు.

'మార్పు.. మార్పు.. అన్న ప్రజలారా ఈరోజు ఆగమయ్యారా' అని కేటీఆర్ ప్రజలను అడిగారు. ఏ హామీని నెరవేర్చని కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ఓటు ఎందుకు వేయాలని రేవూరి ప్రకాష్‌రెడ్డిని నిలదీయాలన్నారు. పరకాల మున్సిపాలిటీలోని 22 వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కేటీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నర్సంపేట నియోజకవర్గంలో ఎన్ని తండాలు ఉన్నాయో రేవూరి ప్రకాశ్‌రెడ్డికి తెలియదని, ఆయన ఏం అభివృద్ధి చేశారో అక్కడి ప్రజలు చెబుతారని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఇప్పుడు పరకాల అభివద్ధి చేస్తానని, ఎంతో చరిత్ర గల పరకాలను నిర్వీర్యం చేయుడానికి పూనుకున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, గండ్ర రమణారెడ్డి, నన్నపనేని నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## జనాన్ని మోసగించింది రేవంత్‌రెడ్డే

సిద్దిపేట :అమృత్ తెలంగాణ: అన్ని వర్గాల ప్రజల్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసగించాడని, చివరికి దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి దేవుళ్లను కూడా మోసగించాడని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సోమవారం దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అబద్ధాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బీజేపీ పార్టీల మాటలు నమ్మవద్దని ప్రజలను కోరారు.



## మూగబోయిన మైకులు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ మున్సిపల్ రెండో సాధారణ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ముగిసింది. ఆరు రోజుల పాటు మోగిన మైకులు మూగబోయాయి. ఈనెల 11న రాష్ట్రంలోని 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరగనుంది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్, 13న ఓట్లను లెక్కిస్తారు. పోలింగ్‌లో ఏవైనా అవాంతరాలు జరిగితే 12న రీ పోలింగ్ నిర్వహించనున్నారు.

ఫిబ్రవరి 14న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక కోసం సంబంధిత కలెక్టర్ నియమించిన అధికారి ప్రత్యేక సమావేశం కోసం నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఫిబ్రవరి 16న ప్రమాణ స్వీకారం అనంతరం ఎన్నిక నిర్వహిస్తారు. ఏదైనా కారణం చేత ఎన్నిక వీలు కాకుంటే మరుసటి రోజు ఫిబ్రవరి 17 నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి జనవరి 28 నుంచి 30 వరకు నామినేషన్లను స్వీకరించారు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 3న తుది అభ్యర్థుల జాబితా విడుదల చేశారు.

8,203 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు

ఎన్నికలు జరుగుతున్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో 8,203 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 25.62 మంది పురుష ఓటర్లు, 26.80 మంది మహిళా ఓటర్లు, 640 మంది ఇతరులు ఉన్నారు. బ్యాలెట్ పేపర్ విధానంలో జరుగుతున్న ఎన్నికల నిర్వహణకు 16,031 బ్యాలెట్ బాక్సులు, 137 స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేశారు. అలాగే 136 లెక్కింపు కేంద్రాలను సిద్ధం చేశారు. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించేందుకు 742 జోనల్ అధికారులు, 279 ఎఫ్ఎస్టీ, 381 ఎస్ఎస్టీ టీంలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది 1,379 రిటర్నింగ్ అధికారులు, 1,547 అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 9,560 పోలింగ్ ఆఫీసర్స్, 31,428 అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు మొత్తం 45,316 మంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు.


తాయిలాలు షురూ...

చేసిన అభివృద్ధి, చేయాల్సిన పనులను ఎంత ఆర్భాటంగా ప్రచారం చేసినా చివరి రెండు రోజులు డబ్బు, మద్యం పంపిణి చేయందే ఓట్లు రాలని విచిత్రమైన పరిస్థితి నేడు రాష్ట్రంలో నెలకొంది. ఈ క్రమంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ ట్రెండ్ మార్చి సైలెంట్ ప్రచారానికి తెరతీశారు. దాంతో చివరి రెండు రోజులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు మద్యం, డబ్బు, ఇతర తాయిలాల పంపిణీపై దృష్టి పెట్టారు. గెలుపోటములపై ప్రభావం చూపే అధికారం, కులం, తదితర అంశాలను తమకు అనుకూలంగా మల్చుకునేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు వదులుకోవడం లేదు.

సద్దుమణిగిన హడావిడి

మున్సిపల్ ప్రచారంలో అన్ని పార్టీలు జోష్ మీద కనిపించాయి. ఫిబ్రవరి 3న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించి గుర్తులు కేటాయించారు.

## మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు.
## సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుండి మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్ష నిర్వహించారు.



వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న సాధారణ ఎన్నికల పరిశీలికులు హనుమంత్ నాయక్




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ విసి హాల్ నుండి పాల్గొన్న ఎన్నికల సాధారణ పరిశీలకులు హన్మంత్ నాయక్ మాట్లాడుతూ, జిల్లాలోని ఆదిలాబాదు మున్సిపాలిటీలో ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన యంత్రాంగం సిద్ధంగా ఉందని, ఓటర్ గుర్తింపు పత్రాల పంపిణీ పూర్తయ్యిందని, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించామని పేర్కొన్నారు. ఓటర్లు సౌకర్యవంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెప్మా పిడి సి.వి.ఎన్. రాజు, తదితరులు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షల అభ్యర్థులు పుస్తక పఠనంపై దృష్టి సారించాలి - జిల్లా కలెక్టర్ రాజర్షి షా



సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



హాజరైన విద్యార్థిని విద్యార్థులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ప్రామాణిక పుస్తకాల పఠనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సోమవారం స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించిన ఫౌండేషన్ ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోటీ పరీక్షల్లో జనరల్ స్టడీస్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రామాణిక పుస్తకాల అధ్యయనం అభ్యర్థులకు సరైన మార్గదర్శకత్వం అందిస్తుందని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లక్ష్యం సాధించే దిశగా ప్రతి అభ్యర్థి ఆశావహ దృక్పథంతో ముందుకు సాగాలని, కష్టసమయాల్లో నిరాశ చెందకుండా పట్టుదలతో చదవాలని హితవు పలికారు. క్రమశిక్షణతో శ్రమిస్తే భవిష్యత్తులో ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాలు సాధ్యమవుతాయని ఆకాంక్షించారు ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేసి, బీసీ స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించిన పలువురిని శాలువాలతో కలెక్టర్ సన్మానించారు ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజలింగం, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ఫ్యాకల్టీ రమేష్, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి - జిల్లా కలెక్టర్ రాజర్షి షా






సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోని, జిల్లాలో వంద పోలింగ్ శాతం నమోదుకు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, మాజీ సైనికుల సంఘాల ప్రతినిధులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో నిర్వహించిన (రాఎజుజ్యూ)ఓటరు చైతన్య కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ ఓటు హక్కు వినియోగించాలని కోరారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, సమాజంలోని అన్ని వర్గాల వారు స్వచ్ఛందంగా ఓటు వేసేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉందని, ప్రతి ఒక్కరు బాధ్యతగా ఓటు హక్కు వినియోగించాలని సూచించారు.. కార్యక్రమంలో భాగంగా ఓటరు అవగాహనపై తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం ప్రదర్శించిన ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారందరితో ఓటు హక్కు వినియోగిస్తామని కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ స్రవంతి, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మున్సిపల్ కమిషనర్ రాజు, కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది, వయోవృద్ధులు, దివ్యాంగులు, మాజీ సైనికులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కేవైసీ అప్‌డేట్ చేయించుకోండి -- జిల్లా కలెక్టర్ రాజర్షి షా




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి బ్యాంకింగ్ సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ఖాతాదారులు తమ కేవైసీ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో "మీ కేవైసీని అప్‌టు డేట్ ఉంచండి -- అంతరాయం లేని బ్యాంకింగ్ సేవలు పొందండి" అనే అవగాహన పోస్టర్లు, ఫ్లెక్సీలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేవైసీ అప్‌డేట్ చేయకపోతే ఖాతాలపై పరిమితులు విధించే అవకాశం ఉందన్నారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు ఆధార్, పాన్, ప్రస్తుత చిరునామా వంటి వివరాలను నిర్ణీత వ్యవధిలో బ్యాంకులకు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. కేవైసీ పేరుతో వచ్చే అపరిచిత లింకులు, ఫోన్ కాల్స్‌పై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలను బ్యాంకు శాఖల్లో లేదా అధికారిక యాప్‌ల ద్వారా మాత్రమే అప్‌డేట్ చేయాలని తెలిపారు. జిల్లాలోని అన్ని బ్యాంకు శాఖల్లో అవగాహన పోస్టర్లు ప్రదర్శించి ఖాతాదారులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పల్ కుమార్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ పారదర్శకంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా




సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



హాజరైన అధికారులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ఆదిలాబాద్ మున్సిపాలిటీ సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్‌తో కలిసి ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్‌తో పాటు కౌంటింగ్ ప్రక్రియ కూడా అత్యంత కీలకమని, కౌంటింగ్ సిబ్బందికి ప్రతి అంశంపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ రోజున అభ్యర్థుల సమక్షంలో ప్రతి దశను వీడియో గ్రాఫీ చేస్తూ నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇద్దరు అభ్యర్థులకు సమాన ఓట్లు వచ్చిన పక్షంలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం డ్రా ద్వారా విజేతను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని 49 వార్డుల కౌంటింగ్ కోసం 49 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కో వార్డులో సుమారు 3000కు పైగా ఓట్లు ఉండే అవకాశం ఉన్నందున, మూడు నుంచి నాలుగు రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది ఫిబ్రవరి 12న జరిగే రెండో విడత శిక్షణకు, అలాగే 13న జరిగే కౌంటింగ్ రోజున నిర్ణీత సమయానికి హాజరు కావాలని, గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, నోడల్ అధికారులు మనోహర్, ఫణిందర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, శిక్షకులు, సంబంధిత ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మాజీ మంత్రి తో కలిసి నిర్వహిస్తున్న నరసాపూర్ జి మండల నాయకులు

నిర్మల్ ఫిబ్రవరి 9 అమృత్ తెలంగాణ బైంసా పట్టణంలోని ఈదుగాంలో కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, తన కార్యకర్తలతో కలిసి మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ప్రచారం నిర్వహిస్తున్నారు

## గులాబీ జెండా ఎగరాలే గుంపులు కట్టి నడవాలే

### ప్రతీ ఒక్కరి గుండెల్లో కేసీఆర్ ఉన్నారు
### మున్సిపాలిటీ ప్రచారంలో దూసుకుపోతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్
### 17,14 వార్డుల్లో గడపగడపకు చేరుకొని ఓటు అభ్యర్తించి





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ నిర్మల్ పట్టణంలో 17,14 వార్డుల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గడపగడపకు ప్రచారం నిర్వహించి కేసీఆర్ పై ఉన్న ప్రేమను ఓటు రూపంలో చాటాలన్నారు. ప్రతీ గడపగడప కేసీఆర్ ని కోరుకుంటుందని, ప్రతీ ఇల్లు ఇల్లు కేసీఆర్ రావాలంటుందన్నారు. తేదీ ఫిబ్రవరి 11న ప్రతీ డబ్బాలో కేసీఆర్ గారికే ఓట్లు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి రాంకిషన్ రెడ్డి, బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఉన్నారు.

## అర్లీ కే లో ఉపాధి హామీ పనులను ప్రారంభించిన సర్పంచ్ చెంధ్యాల మురళి



అర్లీ కేలో ఉపాధి హామీ పనులను ప్రారంభించిన సర్పంచ్ చంద్యాల మురళి

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి ఫిబ్రవరి 9 అమృత్ తెలంగాణ అర్లి కె గ్రామంలో సర్పంచ్ చెంద్యాల మురళి, అధ్వర్యంలో . ఉపాధిహామి పనులను ప్రారంభించడం జరిగింది సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను రైతులు భూమి లేని వారు కూలీలు ఉపాధి హామీ వందరోజుల పనులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు పునప్రారంభం అవ్వడం తో గ్రామస్థులు హర్షం వక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రజిని సుధాకర్, పంచాయతీ కార్యదర్శి శిరీష, మగ్గిడి ప్రభాకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు

## ఓటు వేసి మద్దతు తెలపాలని ఓటర్లకు విజ్ఞప్తి

భువనగిరి.అమృత్ తెలంగాణ: తమ అమూల్యమైన ఓటును కారు గుర్తుకు ఓటు వేసి మద్దతు తెలిపాలని 17వ వార్డు అభ్యర్థి చేన్న స్వాతి మహేష్ కోరారు. సోమవారం 17వ వార్డు సమావేశంలో వారు మాట్లాడారు. మీరు వేసే ఓటు ఐదు సంవత్సరాలు భవిష్యత్తును నిర్ణయిస్తుందని, అభివృద్ధి కోసం పాటుపడే అభ్యర్థిని గెలిపించాలని, గత ఐదు సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి, 17 వ వార్డును అన్ని విధాల అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మరొకసారి తమకు అవకాశం ఇస్తే ఆదర్శవంతమైన తీర్చిదిద్దుతానని తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కేసీఆర్ తీసుకొచ్చిన పథకాలను గుర్తుచేసుకొని ఓటు వేయండి

## నిర్మల్ ను జిల్లాగా చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పించిన బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలవాలి

## నిర్మల్ పట్టణంలోని 3వ వార్డులో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్





మాట్లాడుతున్న శాసనసభ్యులు అనిల్ జాదవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ నిర్మల్ పట్టణంలోని 3వ వార్డులో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ గారు అమలుచేసిన పథకాలను గుర్తుపెట్టుకొని 11వ తేదీన కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి రాంకిషన్ రెడ్డి, బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఉన్నారు

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌తో వీడియో కాన్ఫరెన్స్

## హాజరైన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మరియు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, పోలింగ్ రోజు చేపట్టాల్సిన ఏర్పాట్లు, ఎన్నికల నియమావళి అమలు, శాంతి భద్రతల పరిరక్షణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ...

ఎన్నికల పోలింగ్ మొదలుకొని కౌంటింగ్ వరకు పోలీసు శాఖ తరపున పూర్తి ఏర్పాట్లు, చేశామన్నారు. పోలీసు బందోబస్తు,పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత తదితర అంశాలపై జిల్లా ఎస్పీ డా.జి జానకి షర్మిల ఐపీఎస్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినికి కూలంకుషంగా వివరించారు.

మున్సిపల్ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ డా. జి జానకి షర్మిల తెలిపారు.

# 11 న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపిద్దాం.. జై కాంగ్రెస్.. నినాదంతో : బోరంచు శ్రీకాంత్ రెడ్డి



మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి





కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని తెలియజేస్తున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో 9,10,40,41,45 వ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్ధతుగా గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ప్రచారం లో పాల్గొని చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాల్సిందిగా తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఓటర్లను అభ్యర్తించడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే రానున్న కాలంలో ఆదిలాబాద్ పట్టణంలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై అవగాహన కల్పించారు. అభివృద్ధి,సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి ఆదిలాబాద్ మున్సిపాలిటీ లో కాంగ్రెస్ జెండాను ఎగరవేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

# మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిస్తాం: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్






అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల కలెక్టర్లతో కలిసి మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలలో ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఓటర్ గుర్తింపు పత్రాల పంపిణీ పూర్తయ్యిందని, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించామని పేర్కొన్నారు. ఓటర్లు సౌకర్యవంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల కోసం పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు వీరా రెడ్డి, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డిపివో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో శంకర్, ఎక్సైజ్ అధికారి ఎం.ఏ. రజాక్, సిపిఓ జీవరత్నం, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్--2025-26 జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు







అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్--2025-26 క్రీడల్లో భాగంగా నిర్మల్ జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు చివరి రోజు వాసవి వరల్డ్ స్కూల్ సమీపంలోని క్రీడా మైదానంలో ఉత్సాహంగా నిర్వహించారు జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి దాదాపు 900 మంది క్రీడాకారులు, 120 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, పీఈటీ సంఘాల బాధ్యులు, పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు. కబడ్డీ, యోగా, టైక్వాండో, పవర్ లిఫ్టింగ్, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్, ఉషు, అర్చరీ, వెయిట్ లిఫ్టింగ్, సేపక్ తాక్రా, మల్లఖంబ్, రెజ్లింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని జిల్లా క్రీడల అధికారి తెలిపారు.

# బాధితులకు ఎల్లవేళలా అండగా ఉండాలి. - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

## పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహణ.

## 13 ఫిర్యాదుల స్వీకరణ.

## వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు.

## ప్రజా సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించి, పరిష్కరించాలని ఆదేశాలు.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ప్రతి సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయం నందు ప్రజల సమస్యలపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుంది. ఇందులో భాగంగానే ఈరోజు జరిగిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి 13 ఫిర్యాదుదారులు విచ్చేసి, నేరుగా జిల్లా ఎస్పీ గారికి తమ సమస్యలను విన్నవించుకున్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చి సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి తగు న్యాయం చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ గారిని కలిసిన ఫిర్యాదుదారులలో కుటుంబ సమస్యలు, భూతగాదాలు, పలు కేసుల పురోగతిపై సమస్యలు, భార్యాభర్తల సమస్యలు ఉన్నాయి. అక్రమార్కుల పట్ల కఠినంగా వ్యవహరించాలని, కేసులను నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు అసాంఘిక కార్యకలాపాలపై, తమ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీ గారికి 8712659973 నెంబర్ ద్వారా వాట్సాప్ మెసేజ్ రూపంలో సంప్రదించవచ్చును. ఈ ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో సిసి కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత,సిబ్బంది వామన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలనుండి అర్జీలు స్వీకరిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

# ఓటింగ్ కోసం గుర్తింపు కార్డు తప్పనిసరి: కలెక్టర్



భువనగిరి : అమృత్ తెలంగాణ: ఈ నెల 11న జరగనున్న భువనగిరి,ఆలేరు, యాదగిరిగుట్ట,పోచంపల్లి, చౌటుప్పల్ మోత్కూర్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చే సమయంలో 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని తమ వెంట తీసుకెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు సూచించారు. ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, ఫోటోతో కూడిన పోస్ట్ ఆఫీస్, బ్యాంక్ పాస్ బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ ద్వారా జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, లేబర్ గుర్తింపు కార్డు, ఇండియన్ పాస్పోర్ట్, ఫోటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వంచే జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డు,ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు తదితర వాటిలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని కలెక్టర్ సూచించారు.

# వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలి: ఐటిడిఎ పీఓ యువరాజ్ మార్మాట్





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషకాహారం అందించాల్సిందిగా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ అధికారులను ఆదేశించారు. మంగళవారం దస్తురాబాద్, కడెం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, కడెం (బాలూరు) గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా విద్య, వైద్యం, భోజన ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించి భోజన నాణ్యత, సమయపాలనపై ప్రశ్నించారు. వండిన ఆహారాన్ని పరిశీలించి కంప్యూటర్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. కడెం ఆశ్రమ పాఠశాలలో 170 మంది విద్యార్థుల్లో 115 మంది మాత్రమే హాజరై ఉండగా, హాజరు నమోదు తప్పుడు విధంగా చేయడంపై వార్డెన్‌ను హెచ్చరించారు. దస్తురాబాద్ పాఠశాలలో పల్స్ యాప్ అప్‌డేట్ చేయకపోవడం, నెట్‌వర్క్ కారణాలు చూపడం, తక్కువ మోతాదులో భోజనం అందించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పల్స్ యాప్ పనితీరుపై సమీక్షించి, సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు.

దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు నివారించేందుకు వసతి గృహాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పి, సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



వెల్దండ :అమృత్ తెలంగాణ: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం వరంగా మారిందని కల్వకుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమాళ్ల కృష్ణ అన్నారు. సోమవారం వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామంలో సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను బాధితులకు అందజేశారు. గ్రామానికి చిందిన దెంది శ్వేతకు రూ. 34,500, పసుపుల వెంకటేశ్ పేరిట మంజూరైన రూ. 17వేల చెక్కులను గ్రామ సర్పంచ్ అనూషతో బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఎంతో మంది నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం భరోసా కల్పిస్తుందన్నారు.

ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి ప్రసాదాచారి, ఏ ఎం సి డైరెక్టర్ కృష్ణ,వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్ , శ్రీధర్ ప్రసాద్, రాఘవేందర్ , అనిల్ నాయకులు తదితరులు ఉన్నారు.

# వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి: ఎంపీడీవో



ఊరుకొండ : అమృత్ తెలంగాణ: వేసవి కాలాన్నీ దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. సోమవారం త్రాగునీటి ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఊరుకొండ మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఊర్కొండపేట గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాల సర్పంచులు, వార్డు మెంబర్స్, పంచాయతీ కార్యదర్శులతో రాబోయే వేసవిలో ప్రజలు ఎలాంటి త్రాగునిటి సమస్యలు ఎదుర్కోకుండా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. త్రాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని, రిపేరు చేయాల్సిన బోర్ మోటార్లు ఏమైనా ఉంటే వాటిని రిపేరు చేయించుటకు, పైపు లైన్ లీకేజిలు బాగుచేయించుటకు, హ్యాండ్ పంపులు రేపేరు చేయించుటకు, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయుటకు లీజ్ బోర్లు మాట్లాడుకొని సిద్ధంగా ఉండాలని అన్నారు. అలాగే అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టి గ్రామాలను పరిశుభ్రతతో ఉంచుటకు చర్యలు తీసుకోవాలన్నారు. సందర్శనలో మండల్ లెవెల్ టీం సభ్యులు ఏఈ రోహిత్, ఎంపీఓ లక్ష్మణ్, ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తా: సర్పంచ్



ముధోల్ :అమృత్ తెలంగాణ: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ అన్నారు. సోమవారం ముధోల్ మండలంలోని ఆష్ట గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తొమ్మిది అంశాలపై చర్చించారు. వేసవికాలంలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించి ప్రజలకు నీటి సరఫరా చేయాలని చర్చించారు. స్థానిక వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలనిఅన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపడం జరుగుతుందని, యువత కు జూదం వల్ల కలిగే నష్టాలను వివరించడం తో పాటు పలు అంశాలను గ్రామపంచాయతీ సర్పంచి తో కలిసి పాలకవర్గం సభ్యులు చర్చించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ప్రజల అభిప్రాయం మేరకు ముందుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురుగుల సావిత్రి కోటయ్య, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

# వావ్ చీర కట్టులో నీ అంత అందంగా మరెవ్వరు ఉండరేమో..!




హీరోయిన్స్ ను మోడ్రన్ డ్రస్ ల్లో స్కిన్ షో డ్రస్ ల్లోనే చూడాలని అభిమానులు ప్రేక్షకులు కోరుకుంటూ ఉంటారు. స్కిన్ షో చేసే వారికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.. అంతెందుకు స్కిన్ షో ఎక్కువగా చేసే హీరోయిన్స్ యొక్క ఇన్ స్టా గ్రామ్ పేజ్ కే ఎక్కువ మంది ఫాలోవర్స్ ఉంటారు. అయితే కొద్ది మంది హీరోయిన్స్ చీర కట్టు లో కూడా చూపు తిప్పుకోనివ్వకుండా అందంగా ఉంటారు అంటూ ఇలాంటి ఫోటోలను చూసిన సందర్భంలో అనిపిస్తూ ఉంది. కీర్తి సురేష్ కెరీర్ ఆరంభం నుండే స్కిన్ షో కి దూరంగా ఉంటూ వచ్చింది. స్కిన్ షో చేయని హీరోయిన్స్ కు పెద్దగా ఆఫర్స్ దక్కిన సందర్భాలు ఇండస్ట్రీలో లేవు. ఈ మధ్య కాలంలో హీరోయిన్ అంటే మినిమం నడుము నాభి తొడలు చూపించాల్సిందే. కానీ కీర్తి సురేష్ మాత్రం వాటికి దూరంగా ఉంటూ ఇలా పద్దతైన చీర కట్టులోనే కనిపిస్తూ వచ్చింది. చీర కట్టు లో కనీసం నడుము అందం కూడా చూపించకుండా ఇంత అందంగా కనిపించగల హీరోయిన్ కీర్తి సురేష్ తప్ప మరెవ్వరు ఉండరేమో అంటూ అభిమానులు మాట్లాడుకుంటూ ఉన్నారు. ముద్దుగుమ్మ కీర్తి సురేష్ ఎరుపు చీరలో మెరిసి పోతుంది అంటూ అభిమానులు తెగ లైక్ చేస్తున్నారు. అందాలు ఆరబోయడం కంటే ఇలా చీర కట్టులో పద్దతైన అమ్మాయిగా నే కీర్తి సురేష్ ను చూడాలని తాము కోరుకుంటున్నాం అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. మహానటి సినిమా తర్వాత పాన్ ఇండియా రేంజ్ లో గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ కీర్తి సురేష్ సర్కారు వారి పాట సినిమాలో కాస్త స్కిన్ షో చేసేందుకు ప్రయత్నించింది. ముందు ముందు మరింతగా స్కిన్ షో చేస్తుందా అనేది చూడాలి.

# జీరో సైజ్ నడుముతో మతి పోగొడుతోంది బాబోయ్



పదేళ్ల క్రితం వచ్చిన లవ్లీ సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ శాన్వి శ్రీవాస్తవ. ఈ అమ్మడు మొదట్లో ఒకటి రెండు సక్సెస్ లు దక్కించుకున్నా ఆ తర్వాత మాత్రం అదృష్టం కలిసి రాకపోవడంతో ఫెయిల్యూర్ లను చవి చూడాల్సి వచ్చింది. ఫెయిల్యూర్స్ వల్ల ముద్దుగుమ్మ శాన్వి శ్రీవాస్తవ కొన్నాళ్ల పాటు కనిపించకుండా పోయింది. తిరిగి సినిమా ఇండస్ట్రీలో పాగా వేసేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. పదేళ్ల క్రితం లవ్లీ సినిమాలో ఎలా అయితే కనిపించిందో ఇప్పుడు కూడా అంతే ఫ్రెష్ ఫేస్ తో అందంగా కనిపిస్తుంది అంటూ ఈ ఫోటోలు చూస్తూ ఉంటే అనిపిస్తుంది. అందాల విందు విషయంలో ఈ అమ్మడు ముందు ఉంటుంది అనడంలో సందేహం లేదు. తాజాగా ఇన్ స్టా లో ఈమె షేర్ చేసిన ఈ ఫోటో అందరి హృదయాలను దోచుకుంటుంది అనడంలో సందేహం లేదు. కనిపించని కనిపించకుండా ఉన్న నడుము అందంను ఈమె చూపించింది. జీరో సైజ్ నడుముకు ప్రత్యక్ష సాక్ష్యం అన్నట్లుగా చాలా మంది ఈమె నడుముకు కామెంట్స్ చేస్తున్నారు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పదేళ్లు అయినా కూడా ఇంత అందంగా కనిపిస్తున్న శాన్వి శ్రీవాస్తవ కి యంగ్ హీరోలు ఇప్పటికైనా అవకాశం ఇవ్వాలంటూ ఆమె అభిమానులు కోరుకుంటున్నారు. సినిమాలతో సక్సెస్ అవ్వలేక పోతున్న శాన్వి ఇలా ఇన్ స్టా ఫోటోలతో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఇలా అయిన మళ్లీ సినిమాల్లో ఈమెకు ఆఫర్స్ రావాలని ఆశిస్తున్నారు. కేవలం సినిమాల్లోనే కాకుండా ఈమె సిరీస్ ల్లో కూడా నటిస్తే బాగుంటుందనే అభిప్రాయం ను కొందరు వ్యక్తం చేస్తున్నారు.

# ఆదిపురుష్ బ్యూటీ చీర కట్టులో 'షో' అదుర్స్



తెలుగు లో చాలా సంవత్సరాల క్రితమే ఒక సినిమా లో నటించిన ముద్దుగుమ్మ కృతి సనన్ మళ్లీ ఇన్నాళ్లకు తెలుగు హీరో ప్రభాస్ తో కలిసి ఆదిపురుష్ సినిమా లో నటిస్తున్న విషయం తెల్సిందే. ఈ అమ్మడు ప్రస్తుతం బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా దూసుకు పోతుంది. స్టార్ హీరోలకు ఈమె మోస్ట్ వాంటెడ్. భాష ఏదైనా అందరూ హీరోయిన్స్ సోషల్ మీడియాలో ముఖ్యంగా ఇన్ స్టా లో అందాల ఆరబోత చేయడం కామన్ గా మారింది. బాలీవుడ్ లో ఎంతో మంది స్టార్ హీరోయిన్స్ తో పోల్చితే కృతి సనన్ అందాల ఆరబోత విషయంలో ఒక అడుగు ముందే ఉంటుంది అనడంలో సందేహం లేదు. కృతి సనన్ స్కిన్ షో చేసినా లేదంటే ఇలా చీర కట్టు లో కనిపించినా కూడా అభిమానులు ఆమెను ఆరాధిస్తూనే ఉంటారు.. అభిమానిస్తూనే ఉంటారు అనడంలో సందేహం లేదు. హీరోయిన్ గా ఈ అమ్మడు ఎంతటి బిజీగా ఉన్నా కూడా ఇలాంటి హాట్ ఫోటో షూట్స్ ను రెగ్యులర్ గా షేర్ చేసి అభిమానులను సంతృప్తి పర్చుతోంది.




# అందాల వేదిక.. నాభి అందాలతో స్టన్నింగ్ లుక్



బాణం అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన క్యూట్ హీరోయిన్ వేదిక ఆ తర్వాత తెలుగు తమిళం కన్నడ అని భాషా బేధాలు లేకుండా ప్రతి ఇండస్ట్రీలో కూడా సినిమాలు చేసుకుంటూ వస్తోంది. ఇక ఈ బ్యూటీ మొదట్లో చాలా హోమ్లీ గా కనిపించినప్పటికీ ఇప్పుడు మాత్రం గ్లామర్ ప్రజెంటేషన్ తో ఆశ్చర్యపరస్తోంది. ఎప్పటికప్పుడు వేదిక సరికొత్త గ్లామరస్ ఫోటోషూట్స్ తో ఆకట్టుకుంటూనే ఉంది. ఇటీవల కాలంలో ఇన్స్టాగ్రామ్ లో అత్యధిక ఫాలోవర్స్ ను సంపాదించుకున్న వారిలో వేదిక కూడా టాప్ లిస్టులో ఉంటుంది అని చెప్పవచ్చు. ఈ బ్యూటీ మొదట్లో పెద్దగా గ్లామరస్ పాత్రల్లో అయితే కనిపించలేదు. ఇప్పుడు మాత్రం ఎలాంటి పాత్ర వచ్చిన సరే చేయడానికి సిద్ధంగా ఉన్నాను అని ఈ ఫోటోషూట్స్ ద్వారా చెప్పుకునే చెబుతోంది. గతంలో వేదిక బికినీ అందాలతో కూడా స్టన్ అయ్యేలా చేసింది. ఇక తెలుగులో ఆమె బాణం తర్వాత మళ్ళీ అలాంటి మంచి సినిమాలో కనిపించింది లేదు. మధ్యలో బాలయ్య బాబుతో అలాగే మరికొన్ని చిన్న సినిమాల్లో నటించింది కానీ అవి ఏమీ వర్కౌట్ కాలేదు. ఇక తమిళంలోనే ఎక్కువగా అవకాశాలు అందుకుంటూ స్టార్ హీరోయిన్ గా గుర్తింపు అందుకోవడానికి ప్రయత్నాలు అయితే చేస్తోంది. రీసెంట్ గా అమ్మడు నడుము అందాలను హైలెట్ చేసిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసుకుంది. ఇంతకుముందు వేదిక బికినీలో కనిపించినప్పటికీ ఈ నాభి అందాలు మాత్రం అంతకుమించి అనేలా ఉన్నాయి అని ఆమె ఫాలోవర్స్ చాలా పాజిటివ్ గా స్పందిస్తున్నారు. ఏదేమైనా వేదిక మాత్రం గ్లామర్ పాత్రల్లో నటించడానికి ఆసక్తి చూపిస్తోంది. కానీ ఆమె అనుకున్నంత రేంజ్ లో మాత్రం అవకాశాలు రావడం లేదు. ఇక వేదిక ప్రస్తుతం తమిళ సినిమాలు మాత్రమే కాకుండా కన్నడ ఇండస్ట్రీలో కూడా మంచి అవకాశాలు అందుకునే ప్రయత్నం చేస్తుంది. ఇక తెలుగులో కూడా ఈ బ్యూటీకే రవితేజ సినిమాలో అవకాశం వచ్చే ఛాన్స్ ఉన్నట్లుగా కూడా కథనాలు వెలువడుతున్నాయి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- sigidiamruth404@gmail.com